సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 2 । మార్చి । 2025

- ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 95 శాతం హాజరు
- పలుచోట్ల ఆలస్యంగా ప్రశ్నాపత్రం
- రేపు సెకండియర్ పరీక్షలు





పరీక్షకు ముందు సంపత్ వినాయగర్‌ను దర్శించుకుంటున్న విద్యార్థులు

పరీక్షలు ఆరంభం



విశాఖ విద్య : జిల్లాలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. 87 కేంద్రాల్లో తొలిరోజు సెకండ్ లాంగ్వేజి (తెలుగు/ సంస్కృతం) పరీక్ష జరిగింది. విద్యార్థులను కేంద్రాల్లోకి అరగంట ముందు నుంచే అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు కావడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కేంద్రాల వద్దకు తోడుగా వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా కనిపించింది. కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించారు. అన్ని కేంద్రాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆర్ఐవో పి.మురళీధర్ నగరంలోని పలు కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

ఆలస్యంగా ప్రశ్నాపత్రం

తొలిరోజు కొన్ని కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తాయి. గోపాలపట్నం ఎస్‌వీఎల్ఎన్ఎస్ విద్యాపీఠ(అల్వార్ దాస్) కాలేజీలో విద్యార్థులకు అరగంట ఆలస్యంగా ప్రశ్నాపత్రం ఇచ్చినట్లు విద్యార్థులు చెబుతున్నారు. పోలీసు స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు ఆలస్యంగా తీసుకురావటం వల్లనే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ప్రశ్నాపత్రం ఆలస్యం ఇచ్చిన దృష్ట్యా ఇక్కడ అదనంగా విద్యార్థులకు 30 నిమిషాలు సమయం కేటాయించారు. మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, తగరపువలసలోని ఓ కాలేజీలో 10 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రం ఇచ్చి, విద్యార్థులకు అదనంగా ఆదే సమయాన్ని కేటాయించారు.

95 శాతం హాజరు

ఇంటర్ ఫస్టియర్ జనరల్ కోర్సు 41,945 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 1,945 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1,741 మందికి గాను 107 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 43,686 మంది విద్యార్థులకు గాను 41,634 మంది పరీక్షకు హాజరయ్యారు. 95 శాతం మంది పరీక్ష రాసినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి పి.మురళీధర్ వెల్లడించారు. పరీక్షల్లో ఎటువంటి మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆర్ఐవో కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి అధికారులు పర్యవేక్షణ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.



రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు





పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



జాగ్రత్తలు చెబుతున్న తల్లిదండ్రులు



తమ పిల్లల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు

రేపటి నుంచి సెకండియర్ పరీక్షలు

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 40,744 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. బాలురు 21,464 మంది, బాలికలు 19,280 మంది ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది.

ఇఫ్తార్	సహర్
ఆది	సోమ
6.07	5.00

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సింహాచలం ఇన్‌చార్జి ఈవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకం చేస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థాం ఇన్‌చార్జి ఈవోగా దేవదాయశాఖ రాజమహేంద్రవరం మల్టీజోన్–1 రీజినల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. తొలుత స్వామివారిని దర్శించుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ బేడామండపంలో బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. మూడు నెలలపాటు ఆయన దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తించనున్నారు. ఆయనకు డిప్యూటీ ఈవో రాధ, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాజేంద్ర, శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. .

మేజర్ టాస్క్‌లివే..

వచ్చేనెల 8న స్వామివారి వార్షిక కల్యాణోత్సవం, 30న చందనోత్సవం నిర్వహణ మేజర్ టాస్క్‌లుగా ఇన్‌చార్జి ఈవో పేర్కొన్నా రు. గత ఏడాది చందనోత్సవానికి దేవదాయశాఖ కమిషనర్ వెంట వచ్చి, పూర్తిగా ఫాలో అయినట్లు తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు పెందుర్తి, విశాఖ సిటీ, గాజువాక తహసీల్దార్‌గా పదేళ్ల విశాఖలో పనిచేసిన అనుభవం ఉందన్నారు.

14న అప్పన్న డోలోత్సవం



సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని ఈ నెల 14న శ్రీ వరాహ లక్ష్మీన్రసింహస్వామి డోలోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈవో కె.సుబ్బారావు శనివారం మీడియాకు తెలిపారు. ఈ మేరకు కొండ దిగువ పుష్కరిణి సత్రం వద్ద ఉన్న మండపంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేసి మెట్ల మార్గంలో కొండదిగువకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కొండదిగువ పుష్కరిణి సత్రం ప్రాంగణంలో ఉన్న మండపంలో వేంజేపచేసి డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం జరుగుతుందన్నారు. తదుపరి తిరువీధి నిర్వహించి, తిరిగి కొండపైకి చేర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం నిత్యకల్యాణం రద్దుచేస్తున్నట్లు వెల్లడించారు.

ఏయూపై చిన్నచూపు..!

- బడ్జెట్ కేటాయింపుల్లో అంకెల గారడీ
- వందేళ్ల ఉత్సవాలకు నిధుల ఊసేలేదు
- భారంగా మారనున్న వేతనాల చెల్లింపులు
- గత బకాయిలపై స్పష్టత కరువు



విశాఖ విద్య : ఆంధ్ర యూనివర్సిటీకి బడ్జెట్ కేటాయింపులు అంతా అంకెల గారడీలా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది లెక్కను ప్రాతిపదికగా.. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.389.34 కోట్లు నిధులు కేటాయించారు. అయితే ఏప్రిల్‌లో ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. చారిత్రాత్మకమైన వందేళ్ల పండగను ఏడాదంతా జరుపుకునేలా వర్సిటీ అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇలాంటి తరుణంలో తాజాగా బడ్జెట్ కేటాయింపులు ఏ మూలకు సరిపోతాయని ఇక్కడి ఆచార్యులు ప్రశ్నిస్తున్నారు. ఏయూ విషయంలో కూటమి ప్రభుత్వం పైకి చెప్పేది ఒకటైతే, ఆచరణలో మరోలా ఉందని విద్యావేత్తలు బాహాటంగానే అంటున్నారు.

నాన్ టీచింగ్‌కు టైం స్కేల్ ఇంకెప్పుడో..

వర్సిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇస్తామని కూటమి నేతలు అధికారంలోకి రాకముందు హామీ ఇచ్చారు. బడ్జెట్ కేటాయింపులు ఇందుకు అనుగుణంగా లేకపోవడంతో.. ఇప్పట్లో ఆ హామీ అమలయ్యే పరిస్థితి కనిపించటం లేదు. ఏయూలో 1000 మంది వరకు నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరంతా తమకు టైం స్కేల్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడక తప్పని పరిస్థితి.

వేతనాలకు తప్పని ఎదురుచూపులు

వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కలిపి 2,010 మంది వరకు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.16 కోట్లు జీతాల రూపేణా చెల్లిస్తున్నారు. పెన్షనర్స్ 3,500 మంది వరకు ఉన్నారు. వీరికి నెలకు రూ.17.5 కోట్లు అవసరం ఉంటుంది. యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.43 కోట్లు వరకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం సవ్యంగా నిధులు మంజూరు చేయకపోవడంతో.. వర్సిటీ సొంత నిధులతో వీరందరికీ అడ్వాన్స్‌లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై వర్సిటీ ఆచార్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అయితే సామాజిక మాధ్యమాల వేదికగా వర్సిటీ పాలనాధికారులపై బాణాలు రువ్వుతున్నారు.

బకాయిల ఊసేది

ఆచార్యులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, పెన్షనర్స్‌కు అడ్వాన్స్‌ల రూపేణా చెల్లించిన రూ.68 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. దీనిని బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం. జనవరి నెల వేతనాలు నేటికీ అందకపోగా, ఫిబ్రవరి వేతనాలు ఇంకెప్పుడు ఇస్తారో అని వర్సిటీ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రూ.68 కోట్లు వస్తేగానీ వేతనాలు చెల్లించలేమని వర్సిటీ అధికారులు చెబుతుండడంపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

'ఎయిడెడ్' భారం ఏయూదే..?

ఆంధ్ర యూనివర్సిటీలో 60 మంది వరకు ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన వారు పనిచేస్తున్నారు. వీరికి నెలకు సుమారుగా రూ.1.2 కోట్లు వేతనాల రూపేణా ఏయూ చెల్లిస్తోంది. వీరందరికీ ప్రమోషన్లకు సంబంధించిన ప్రోత్సాహకాలను యూనివర్సిటీనే చెల్లించాలని తాజాగా ఉన్నత విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇది వర్సిటీకి మరింత భారం కానుంది.

వందేళ్ల ఉత్సవాలు ఎలా..?

వర్సిటీ వందేళ్ల ఉత్సవాలకు బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు ఉంటాయని అంతా భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అటువంటి ఆలోచన చేయకపోవడంతో వందేళ్ల ఉత్సవాలకు నిధులు ఎలా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

గత మూడేళ్లలో కేటాయింపులు

సంవత్సరం	రూ. కోట్లలో
2022-23	424.29
2023-24	402.40
2024-25	389.34
2025 - 26	389.34

(ఏడాది పొడవునా జరగనున్న వందేళ్ల ఉత్సవాలకు నిధులు లేవు. ప్రభుత్వం నుంచి రూ.68 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది)

విద్యకే తొలి ప్రాధాన్యం

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య చేరువ కావాలి
- వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య రాజశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న ఏయూ నూతన వీసీ ఆచార్య రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వర్సిటీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, వర్సిటీ వ్యవస్థాపక ఉప కులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. వైస్ చాన్సలర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య రాజశేఖర్ ఏయూలో అవినీతికి స్థానం లేదని ఇతర ఆచార్యుల సమక్షంలో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేశారు. పరిశోధకులకు సంబంధించిన పలు దస్త్రాలపై ఆయన తొలి సంతకాలు చేశారు. అనంతరం ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు ఇతర అధికారులతో అకడమిక్ సెనేట్ మందిరంలో సమావేశమయ్యారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య రాజశేఖర్‌ను రిజిస్ట్రార్ ధనుంజయరావు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ విభాగాధిపతులు, కాలేజీల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫ్రెండ్లీ వైస్ చాన్సలర్‌గా ఉంటా..

ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ విలేకరులతో మాట్లాడారు. పారదర్శకంగా, అవినీతి రహితంగా పనిచేస్తామన్నారు. విద్యా కార్యక్రమాలకే తాను తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్టను ఇనుమడింపజేసే విధంగా ముందుకెళ్తామన్నారు. విద్యార్థులతో ఫ్రెండ్లీ వైస్ చాన్సలర్‌గానే ఉంటానని, వారు ఎప్పుడైనా తనను కలవవచ్చన్నారు.

వందేళ్ల ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకం

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సరంలోకి వెళుతోందని, ఇది ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. వందేళ్ల ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. వర్సిటీలో ఆచార్యుల కొరత ఉందని, అదే విధంగా నిధుల లేమి కూడా ఉందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ఈ సమస్యను అధిగమించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పెద్ద పీట

ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానం చేస్తామని నూతన వీసీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉన్నత విద్య దిశగా నడిపించడానికి కృషి చేస్తామన్నారు. ఇందుకు బృహత్తరమైన కార్యాచరణతో ముందుకెళ్తామని చెప్పారు. ఏయూ ఉపకులపతి.. పదవిగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకుంటానన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఏయూ జాతీయస్థాయిలో అభివృద్ధి సాధించడం, పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం తమ లక్ష్యమన్నారు. విద్యార్థుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల తరహాలో లీడర్‌షిప్ అకాడమీ ఏర్పాటు దిశగా పని చేస్తామన్నారు. విశ్వవిద్యాలయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేయడం, ఇండస్ట్రియల్ కాంక్లేవ్‌లు నిర్వహిస్తామని వివరించారు.

వ్యక్తిగత విమర్శలు చేసిన కూటమి నేతలపై చర్యలెప్పుడు?

- పోసాని అరెస్ట్‌తో కొత్త సంస్కృతికి తెరతీశారు
- అంకెల గారడీతో రాష్ట్ర బడ్జెట్
- ఎల్లో మీడియాలో రాతలకే ఈ బడ్జెట్ పరిమితం
- చంద్రబాబు రూ.1.20 లక్షల కోట్లు అప్పు చేస్తే గొప్పగా రాతలా?
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కన్నబాబు ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కన్నబాబు

సాక్షి, విశాఖపట్నం: అసెంబ్లీ సాక్షిగా తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, తమ పార్టీ నేతలపై అత్యంత హీనంగా, బండ బూతులు మాట్లాడిన కూటమి పార్టీల నాయకులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటా రని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. సినీనటుడు పోసాని కృష్ణమురళికి ఆరోగ్యం బాలేకపోయినా జైలులో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. లాసన్స్‌బేకాలనీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు పోసాని అరెస్ట్ ద్వారా కూటమి ప్రభుత్వం కొత్త సంస్కృతికి తెర తీసిందని, తర్వాత వచ్చే ప్రభుత్వాలు కూడా ఇదే ఆనవాయితీని అనుసరిస్తారనే విషయం మరిచిపోవద్దని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే జాలిపడే పరిస్థితి కలుగుతోందన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగమంతా చంద్రబాబు, లోకేష్‌ను పొగడడానికే సరిపోయిందని ఎద్దేవా చేశా రు. 'వాస్తవ రూపంలో ఈ బడ్జెట్ అమలు కాదు.. ఇదంతా అంకెల గారడీ బడ్జెట్ మాత్రమే.. సంపద సృష్టి లేదు. రూ.80వేల కోట్లను ఎలా పూడ్చుతారు.. అంటే జనం మీద బాదేస్తారా..? ఈ బడ్జెట్ కేవలం ఎల్లో మీడియాలో రాసుకోవడానికే పరిమితం' అని కన్నబాబు అన్నారు. ఒకరేమో బాహుబలి బడ్జెట్ అని, మరొకరు పేదల బడ్జెట్ అని డబ్బా కొట్టడానికే సరిపోయిందన్నారు. తమ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పు చేసి కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకున్నారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల కోసం అప్పు చేస్తే రాష్ట్రాన్ని శ్రీలంకలా చేస్తున్నారని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ప్రచారం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కాలంలో రూ.1.20 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారంటే.. పాత బకాయిలు చెల్లించామని చెబుతున్నారు. మరి 2014–19లో చేసిన బకాయిలను తమ ప్రభుత్వంలో చెల్లించలేదా..? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలు ఊసేలేదని.. రెండు పథకాలకు కూడా అరకొర నిధులే కేటాయించారని దుయ్యబట్టారు. పేదలకు వైద్యం అందించే ఆరోగ్యశ్రీ ఎత్తేస్తున్నారని ఈ బడ్జెట్‌ను చూస్తే స్పష్టంగా కనిపిస్తోందని కన్నబాబు అన్నారు. పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అగచాట్లు



పెదజాలారిపేటలో రోడ్డుపై పెన్షన్లు అందజేస్తున్న సచివాలయం ఉద్యోగి

- నాడు ఇంటి వద్దే.. నేడు వీధి చివరలో..!
- నడి రోడ్డుపై నిలబెట్టి పండుటాకులకు పింఛన్లు
- లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వ సిబ్బంది
- చెప్పిన చోటికి వచ్చి సొమ్ము తీసుకోవాలంటూ హుకుం
- 9 నెలల్లోనే జిల్లాలో 5,861 మంది పింఛన్లకు కోత



రోడ్డుపైనే పెన్షన్లు అందజేస్తున్న సచివాలయం ఉద్యోగి

సాక్షి, విశాఖపట్నం: ఏడాది కాలంలో ఎంత తేడా? గతేడాది మార్చిలో ఒకటో తేదీ ఉదయాన్నే.. కోడి కూయకముందే అవ్వా.. తాతా.. అనే పిలుపు వినిపించిన విషయం గుర్తే ఉంటుంది. ఇంటి దగ్గరకు వచ్చిన పింఛన్ డబ్బులతో పండుటాకుల కళ్లల్లో ఆనందం కనిపించేది. మరి ఇప్పుడో.! ఒకటో తేదీ వచ్చిందన్న సంతోషం పింఛనుదారుల్లో మోముల్లో వికసించడం లేదు. పింఛన్‌ను కానుకగా అందుకున్న రోజులు పోయాయి. కాసుల కోసం వీధి చివర కాపాలా కాసే రోజులను తీసుకొచ్చేసింది కూటమి ప్రభుత్వం. అంతేనా? 9 నెలల్లో ఏకంగా 5,861 మంది పింఛన్లు తొలగించేసింది. గతంలో తొమ్మిదేళ్ల సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు అవ్వాతాతల విషయంలో ఎలా దుర్మార్గంగా వ్యవహరించారో.. ఇప్పుడూ అదే తీరు కనబరుస్తున్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపు తట్టి మరీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులకు ఎలాంటి కష్టం రాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల నుంచి.. పండుటాకుల వరకు పింఛను పొందేందుకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.

మేం చెప్పిన చోటికి వస్తేనే పింఛన్

సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇస్తారంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రగల్భాలు పలికారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. లబ్ధిదారుల ఇంటికి వచ్చే ప్రసక్తే లేదని.. తాము చెప్పిన చోటికి వస్తేనే పింఛను డబ్బులు ఇస్తామని సిబ్బంది తెగేసి చెబుతున్నారు. లేదంటే తమ చుట్టూ పింఛను కోసం తిరగాల్సిందేననే విధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సిబ్బంది చెప్పిన చోటకు లబ్ధిదారులు వెళ్లి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వీధి చివరిలో.. మూడు నాలుగు వీధుల చివర్లో పింఛను కోసం ఉదయం నుంచి వేచి చూస్తున్నారు. ఉదయం 7 గంటలకు వెళ్లి ఎండలో పడిగాపులు కాస్తుంటే.. తీరిగ్గా సిబ్బంది వచ్చి.. స్కూటీ, బైక్ దిగకుండానే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

9 నెలల్లో 5,861 మంది పింఛన్ల కోత

2014లో అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట ఉన్న పెన్షన్లకు టీడీపీ ప్రభుత్వం ఎలా కోత విధించిందో.. ఈ సారీ అదే సీన్ రిపీట్ అవుతోంది. 2024లో ఎన్నికల నోటిఫికేషన్ సమయానికి గత మార్చిలో విశాఖ జిల్లాలో 1,65,891 మంది పింఛనుదారులుండేవారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గత జూలైలో మొదటిసారి పింఛను పంపిణీ చేసిన సమయానికి 1,64,150 మందికి మాత్రమే పింఛను ఇచ్చారు. అంటే మొదటి నెలలోనే 1,741 మందికి కోత విధించారు. 9 నెలలు తిరిగే సరికి ప్రస్తుతం 1,60,030 మందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అంటే అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ఏకంగా 5,861 పింఛన్లకు కోత విధించారు. దీని వెనుక స్థానిక టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు సమాచారం. తమకు అనుకూలంగా లేని వారిని గుర్తించి.. వారి పేర్లను పింఛన్ల జాబితా నుంచి ప్రతి నెలా తొలగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్చిలో 1,60,030 మంది పింఛనుదారులుండగా.. శనివారం తుది సమాచారం మేరకు 95.84 శాతం మందికి పింఛన్ అందజేశారు. 1,53,378 మందికి రూ.66.60 కోట్లు పంపిణీ చేశారు.

థియేటర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- స్టాఫ్ నర్సులకు మెమోలు
- కేజీహెచ్‌లో శిశువుల తారుమారు ఘటన

దాబాగార్డెన్స్: కేజీహెచ్ గైనిక్ విభాగంలో శిశువుల తారుమారు ఘటనకు సంబంధించి థియేటర్ అసిస్టెంట్ డి.రామాను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఏడుగురు అధికారులతో కమిటీ వేసిన విషయం తెలిసిందే. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు థియేటర్ అసిస్టెంట్ డి.రామాను సస్పెండ్ చేయడంతో పాటు, విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్ నర్సులకు మెమోలు జారీ చేసినట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. ఆపరేషన్ థియేటర్లలో పనిచేస్తున్న థియేటర్ అసిస్టెంట్లు, నాల్గో తరగతి ఉద్యోగులు, విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండే స్టాఫ్ నర్సులను మార్పు చేయాలని డీసీఎస్ఆర్ఎంవో మెహర్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఈ తరహా ఘటనలు, తొందరపాటు చర్యలు జరగకుండా ప్రత్యేక భద్రత ఏర్పాట్లు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

నకిలీ డాక్టర్లతో సంబంధం లేదు

రూ.లక్షకే కిడ్నీ ఇస్తామని మోసగించిన నకిలీ డాక్టర్ల విషయమై కేజీహెచ్‌కు ఎటువంటి సంబంధం లేదని సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇది బయట వ్యక్తులు చేసిన మోసమని, ప్రజలు అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఇలాంటి సమాచారం ఎవరైనా ఇస్తే.. కమాండ్ కంట్రోల్, కలెక్టర్ కార్యాలయ హెల్ప్‌లైన్ నంబర్లు 0891-2590100, 2590102కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేజీహెచ్‌లోని వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారా మెడికల్, క్లాస్–4 ఉద్యోగులు, ఏ ఇతర సిబ్బంది కూడా ఇటువంటి చర్యలకు పాల్పడరని, అవయవ దానం అనేది జీవన్‌దాన్ అనే సంస్థ ద్వారా మాత్రమే జరుగుతుందన్నారు.

అప్పన్న సన్నిధిలో వశిష్ట, అంజలి



అప్పన్న ఆలయంలో ఆశీర్వచనం స్వీకరిస్తున్న దర్శకుడు వశిష్ట, హీరోయిన్ అంజలి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ దర్శకుడు వశిష్ట(బింబిసార, విశ్వంభర ఫేం), హీరోయిన్ అంజలి శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రసాదాన్ని అధికారులు అందించారు.

పలు రైలు నంబర్లలో మార్పులు

తాటిచెట్లపాలెం : ఆయా స్టేషన్ల మధ్య నడుస్తున్న పలు రైళ్లకు ఈ నెల నుంచి నెంబర్లలో మార్పులు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం పాసింజర్ ఈనెల ఒకటో తేదీ నుంచి 18515/18516 నెంబర్లతో నడుస్తుంది. భువనేశ్వర్-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ ఈనెల 7వ తేదీ నుంచి 20849 నెంబర్, రామేశ్వరం-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వ తేదీ నుంచి 20850 నెంబర్లతో నడుస్తాయి. భువనేశ్వర్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ ఈనెల 4వ తేదీ నుంచి 20851 నెంబర్, పుదుచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 5వ తేదీ నుంచి 20852 నెంబర్లుతో నడుస్తాయి. భువనేశ్వర్-చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈనెల 6వ తేదీ నుంచి 20853 నెంబర్, చెన్నై-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 7వ తేదీ నుంచి 20854 నెంబర్లతో నడుస్తాయి.

'ఓపెన్' వ్యాపారం

- సార్వత్రిక పరీక్షల్లో ఏజెంట్లదే ఇష్టారాజ్యం
- ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు రంగం సిద్ధం
- ఒక్కో అభ్యర్థి నుంచి రూ.10 వేల వసూలు?
- ఆనందపురం, భీమిలి సెంటర్లు నుంచే అత్యధిక విద్యార్థులు
- ఆ సెంటర్లలో చూసిచూడనట్లు ఉండాలని ఓ కూటమి నేత సిఫార్సు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభయ్యే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు లోపాయికారీ ఒప్పందాలు జరిగినట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. జిల్లాలో 21 స్టడీ సెంటర్లు నుంచి ప్రవేశాలు పొందిన 1,255 మంది పరీక్షలకు హాజరవుతుండగా, వీరి కోసమని ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతానికి భిన్నంగా రెగ్యులర్ ఇంటర్ పరీక్షలతో పాటే ఈ ఏడాది ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ఇచ్చారు. దీంతో జిల్లా విద్యాశాఖ పరిధిలోని హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఇదే కొంత మంది అక్రమార్కులకు వరంగా మారింది. కొన్ని కేంద్రాల్లో పరీక్ష రాసే విద్యార్థుల నుంచి పాస్ గ్యారెంటీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఉపాధ్యాయుల అండదండలతో, ఓపెన్ కోర్సుల అడ్మిషన్లు చేయించిన ఏజెంట్లు ఈ వ్యవహారంలో కీలక పాత్ర వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇదేదో తేడాగానే ఉంది!

జిల్లాలోని ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి, రెండో సంవత్సరం కలిపి 29 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. కానీ, ఇక్కడ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులో 153 మంది అడ్మిషన్లు పొందారు. అదే విధంగా జెడ్పీ హైస్కూల్‌లోని స్టడీ సెంటర్‌లో 103 మంది చేరారు. ఇక్కడ జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోనే జూనియర్ కాలేజీ కూడా నిర్వహిస్తున్నారు. రెండు సెంటర్లే అయినప్పటికీ.. ఒకే ప్రాంగణంలో ఉన్న ఇక్కడి నుంచి 256 మంది ఓపెన్ విధానంలో పరీక్షలకు హాజరవుతుండటం గమనార్హం. కాలేజీలో రెగ్యులర్ విధానంలో చదివేందుకు మండలంలో విద్యార్థుల కొరత ఉందని, విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఓపెన్ విధానంలో ఇంతమంది ఎక్కడ నుంచి వచ్చారు? ఒకే ప్రాంగణంలో ఉన్న హైస్కూల్, జూనియర్ కాలేజీలోనే ఎందుకు చేరారు? దీని వెనుక దాగి ఉన్న మర్మమేంటనేది కలెక్టర్ లేదా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఓ సారి పరిశీలన చేస్తే లోగుట్టు బయటపడుతుందని మిగతా స్టడీ సెంటర్ల నిర్వాహకులు బాహాటంగానే అంటున్నారు.

మాస్ కాపీయింగ్‌కు స్కెచ్

జిల్లాలో 21 స్టడీ సెంటర్లు ఉన్నప్పటికీ.. ఆనందపురం, భీమునిపట్నం కేంద్రాల నుంచే ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. కొంతమంది ఏజెంట్ల ప్రమేయంతో పాస్ గ్యారెంటీ పేరుతో ఇక్కడ అడ్మిషన్లు చేయిస్తూ.. మాస్ కాపీయింగ్‌కు ప్రేరేపిస్తున్నారనే ప్రచారం ఉంది. గత ఏడాది ఈ కేంద్రాల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడం, ఇన్విజిలేటర్లు ప్రమేయంతో మాస్ కాపీయింగ్‌కు ప్రోత్సహించడం వంటి వాటిని గుర్తించిన అప్పటి డీఈవో చంద్రకళ తీవ్రంగా పరిగణించి ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. తనిఖీల్లో పలువురు విద్యార్థులను డిబార్ చేశారు. అయితే విద్యాశాఖలో షాడో అధికారులుగా పెత్తనం చెలాయిస్తున్న కొంత మంది అండతో సోమవారం నుంచి జరిగే సార్వత్రిక ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

అక్కడ ఏజెంట్లదే హవా

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్లుకు అదే చోట పనిచేసే ఉద్యోగులను కో-ఆర్డినేటర్లుగా నియమించారు. అయితే, ఆనందపురం, భీమునిపట్నం కేంద్రాలుగా ఉన్న స్టడీ సెంటర్లలో ఏజెంట్ల హవా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ రెండు కేంద్రాల్లో జరిగే పరీక్షలపై చూసీచూడనట్లుగా ఉండాలని కూటమి నేత ఒకరు, ఉపాధ్యాయులకు హుకం జారీ చేసినట్లు తెలుస్తోంది. డాబాగార్డెన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఐదుగురు, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోని స్టడీ సెంటర్‌లో ముగ్గురు మాత్రమే చేరారు. విశాఖ నగరంలో అందరికీ అందుబాటులో ఉన్న ఇలాంటి సెంటర్లలో చేరకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇతర ప్రాంతాల విద్యార్థులంతా ఆనందపురం, భీమునిపట్నంలోని కేంద్రాలకు ఎందుకు వెళ్తున్నారనేది తేలాల్సి ఉంది.

ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరిగే పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. ఆనందపురం, భీమునిపట్నం కేంద్రాల్లో గత అనుభవాల దృష్ట్యా నిఘా పెట్టాం. గతంలో అక్కడ ఇన్విజిలేషన్ విధులు నిర్వహించన వారందరినీ, ప్రస్తుత పరీక్షలకు దూరం పెట్టాం.

– మురళీమోహన్, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

ఫార్మాసిటీలో ప్రమాదం

- రసాయన వాయువులు పీల్చి అస్వస్థత

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ జేఎస్ ఫార్మాసిటీలోని ఆప్టోరియా ఫార్మా యూనిట్-6లో శుక్రవారం అర్ధరాత్రి దాటాక(1 గంట సమయంలో) జరిగిన ప్రమాదంలో సబ్బవరం ప్రాంతానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు కె.అప్పలనాయుడు అస్వస్థతకు గురయ్యాడు. ప్రమాదానికి సంబంధించి పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు.. అస్వస్థతకు గురైన అప్పలనాయుడు ఆరేళ్లుగా ఆప్టోరియా పరిశ్రమలో కాంట్రాక్టు హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్లాడు. విధి నిర్వహణలో భాగంగా 15 కిలోల ఎజెటిమైబ్(ఔషధ మధ్యస్థ పదార్థం) నచ్ ఫిల్ట్రేషన్ చేశాక అన్‌లోడ్ చేసే బాధ్యతను తీసుకున్నాడు. అనంతరం మెథిలిన్ డైక్లోరైడ్(ఎండీసీ)తో నచ్ ఫిల్టర్ బ్యాగును కడిగి ఆరబెట్టేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఎండీసీ ప్రభావంతో అప్పలనాయుడు స్పృహ తప్పి పడిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించి తోటి ఉద్యోగులు బాధితుడిని అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్చి, వైద్య సేవలు అందిస్తున్నారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడని సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

ఆప్టోరియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, యాజమాన్య నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదంలో అస్వస్థతకు గురైన అప్పలనాయుడుకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

4 నెలల్లో 8 మంది బాలింతలు, శిశువుల మృతి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

- మాతాశిశు మరణాలపై కలెక్టర్ హరేందిరప్రసాద్ ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాతాశిశు మరణాల రేటు పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆధునిక సదుపాయాలు కల్పించినా.. వాటి నిర్వహణలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో బాలింతలు, శిశువులు మృత్యువాత పడుతున్నారు. గత నాలుగు నెలల కాలంలోనే జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదుగురు బాలింతలు, ముగ్గురు శిశువులు మరణించినట్లు వైద్యాధికారుల గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. వైద్య సేవలు అందుతున్న తీరు సరిగా లేకపోవడంపై కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రకాల సదుపాయాలు, వసతులు, ఆధునిక సాంకేతిక వైద్య పరిజ్ఞానం ఉన్నప్పటికీ మాతాశిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయంటూ వైద్యాధికారులను, సిబ్బందిని ప్రశ్నించారు. 2024 అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి నెల వరకూ జిల్లాలోని వివిధ ఆసుపత్రుల పరిధిలో చోటుచేసుకున్న మాతాశిశు మరణాలపై కలెక్టర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నాలుగు నెలల కాలంలో మొత్తం ఎనిమిది దుర్ఘటనలు చోటు చేసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని వైద్యాధికారుల్ని హెచ్చరించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, దానికి తగ్గ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణులకు, బాలింతలకు అందించే వైద్యపరమైన సేవలపై ఏఎస్ఎం, ఆశా కార్యకర్తలకు మరోసారి సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, డీఐవో లూసీ, డీసీహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, డీఎంవో తులసి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ అప్పారావు, కేజీహెచ్, వివిధ ప్రైవేటు ఆసుప్రతుల వైద్యులు, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



వైద్య బృందాన్ని అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఓ మహిళ కడుపు నుంచి 10 కిలోల కణితిని తొలగించారు. కేజీహెచ్ వైద్యులు తెలిపిన వివరాలు.. 33 ఏళ్ల వయసున్న ఓ మహిళ గత నెల 7న కేజీహెచ్‌లో చేరారు. ఆమెకు ఏడాదిగా కడుపులో గడ్డ క్రమేపీ పెరుగుతూ తీవ్రమైన కడుపు నొప్పి వస్తోంది. దీంతో గైనిక్ విభాగం 5వ యూనిట్‌లో అడ్మిట్ చేసి పరీక్షలు నిర్వహించారు. ఆమె కడుపు, పెల్విస్‌లకు అల్ట్రాసోనోగ్రఫీ, ఎంఆర్ఐ స్కాన్ చేయగా గర్భాశయంలో 34 వారాల పరిమాణంలో గడ్డ(కణితి)ను గుర్తించారు. గైనిక్ విభాగం వైద్యులు, అనస్తీషియా వైద్య బృందం శుక్రవారం ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించి, దాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన గైనిక్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సృజన, లీలామాధురి, పీజీలు అనూష, నళిని, ఎవాంజెలిన్, లక్షిత, మాధురి, హేమలత, అనస్తీషియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యోగిత, స్టాఫ్ నర్స్ విజయ ఉన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ గైనిక్ విభాగాన్ని సందర్శించి, రోగి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని అభినందించారు.

చికెన్ ధరలు	
ఫారం ధర	: రూ.90
బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్ లెస్	: రూ.200

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



మాట్లాడుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రామచంద్రరావు

తాటిచెట్లపాలెం: రైల్వే ప్రయాణికుల భద్రతను మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ పి.రామచంద్రరావు సూచించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం అంతర్‌రాష్ట్ర సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత కోసం ఆయా రాష్ట్రాల, జిల్లాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైల్వే భద్రతా దళం, గవర్నమెంట్ రైల్వే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సీసీ ఫుటేజీలను విస్తృతంగా వినియోగించడంతో పాటు ప్రయాణికుల హెల్ప్‌లైన్ 139, రైల్ మదద్ పోర్టల్ ద్వారా తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్, మహిళా కోచ్‌ల్లోకి పురుషుల ప్రవేశం, మాదక ద్రవ్యాల రవాణా వంటి వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో విశాఖపట్నం, రాయగడ ఇన్‌స్పెక్టర్లు, విజయనగరం, పలాస, శ్రీకాకుళం సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, విశాఖపట్నం, రాయగడ, అరకు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

అట్టహాసంగా 'సమారంభ్ 9.0'



బెస్ట్ విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ రీజనల్ మేనేజర్ సతీష సాలుంకే

తగరపువలస: గంభీరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నం(ఐఐఎంవీ)లో శనివారం 'సమారంభ్ 9.0' పేరుతో వార్షిక సాంస్కృతిక ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో విద్యార్థులు తమ సృజనాత్మకత, ప్రతిభ, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించారు. 'కెలిడోస్కోప్' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ ఉత్సవం, రంగులు, అనుభవాలు, దృక్కోణాల సమ్మేళనంగా నిలిచింది. సోలో గానం, ఫ్యాషన్ షోలు, నృత్య ప్రదర్శనలు వంటి వివిధ కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ప్రముఖ సింగర్ షాహిద్ మాల్యా, మైసూర్ ఎక్స్‌ప్రెస్ బ్యాండ్, డీజేలు తమ సంగీతంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. వేడుకల్లో భాగంగా అకడమిక్, స్పోర్ట్స్, ఆల్-రౌండర్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ బరోడా అవార్డులను అందజేసింది. ముస్కాన్ శర్మ, దివ్యా సింగ్, ఖుషి షాలకు ఒక్కొక్కరికి రూ. 31,000 నగదు పురస్కారాలను బ్యాంక్ అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ సతీష్ సాలుంకే అందజేశారు. ఐఐఎంవీ అడ్మినిస్ట్రేషన్ డీన్ కావేరి కృష్ణన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు



సీతంపేటలోని సీఏ స్పా సెంటర్

సీతమ్మధార: ద్వారకా పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ స్పా కేంద్రంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సీతంపేట రిలయన్స్ పెట్రోల్ బంక్ రోడ్డులోని సీఏ లగ్జరీ థాయ్ స్పా సెంటర్‌పై ఎస్ఐ భరత్ ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో నలుగురు యువతులు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు యువతులు ఉత్తర భారత్‌కు చెందిన వారు కాగా, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన ఇద్దరు యువతులు ఉన్నారు. నిర్వాహకుడు చైతన్య పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ద్వారకా పోలీసులకు అప్పగించారు. దీంతో ఈ కేసుని ద్వారకా సీఐ డీవీ రమణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.


ట్రంప్ వల్ల జెలెన్‌స్కీకి ప్రాణహాని

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య వైట్‌హౌస్‌లో జరిగిన వివాదంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖలోని ఆశీలమెట్టలో గల తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైట్‌హౌస్‌లో ఇదివరకు ఎప్పుడూ ఇటువంటి మాటల యుద్ధం జరగలేదని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఈ సంఘటనపై జెలెన్‌స్కీకి ట్రంప్ క్షమాపణ చెప్పాలని పాల్ సూచించారు. జెలెన్‌స్కీకి ప్రాణహాని ఉందని, దానికి ట్రంప్ బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ వివాదం ఇక్కడితో ఆగకపోతే ప్రపంచయుద్ధం మొదలయ్యేది రష్యాతో కాదని, చైనా మొదలుపెడుతుందని సంచలన వాఖ్యలు చేశారు. ప్రపంచశాంతి నెలకొల్పేందుకు ప్రజాశాంతి పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు మార్చి మూడోవారంలో అమెరికా వెళ్లనున్నట్లు పాల్ పేర్కొన్నారు.

'ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్'కు విశేష స్పందన



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ట్రేడ్‌ఫేర్ ఎగ్జిబిషన్

సీతంపేట: అక్కయ్యపాలెం హైవే పక్కన గల పోర్టు స్టేడియంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. గత నెల 21న ప్రారంభమైన ట్రేడ్ ఫెయిర్ ఈ నెల 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో దేశ విదేశాలకు చెందిన ఫర్నిచర్, గృహోపకరణాలు, చీరలు, డ్రైఫ్రూట్స్, కాస్మోటిక్స్, పాదరక్షలు, జ్యూవెలరీ వంటి గృహావసరాలు తీర్చే అన్ని వస్తువులు ఒకేచోట లభిస్తున్నాయి. దేశంలోని 22 రాష్ట్రాలకు చెందిన ప్రముఖ ఉత్పత్తులతో పాటు టర్కీ, థాయ్‌లాండ్, దుబాయ్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ వంటి దేశాలకు చెందిన లక్షకు పైగా ఉత్పత్తులు ప్రదర్శనలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన 500లకు పైగా ఎయిర్ కండిషన్డ్ స్టాల్స్‌లో దేశ విదేశాల్లో పేరొందిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం జరుగుతోంది. సోమవారంతో ట్రేడ్ ఫెయిర్ ముగియనుంది. లక్షకు పైగా ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు 70 శాతం వరకు తగ్గింపు ధరలతో లభిస్తున్నాయని, ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రేడ్ ఫెయిర్ ఎండీ సుజీత్ గుప్తా, డైరెక్టర్ పాయల్ ఆచార్య గుప్తా కోరారు. ప్రదర్శనకు వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక ఆహార రుచులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్నట్టు తెలిపారు.